నేటి నుంచి మొదటి విడుత ర్యాండమైజేషన్

● రిటర్నింగ్ అధికారి వెంకట్రావ్

ర్యాండమైజేషన్‌పై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, అక్టోబర్ 19 : ఎన్నికల నిర్వహణకు వినియోగించే పరికరాల మొదటి విడుత ర్యాండమైజేషన్ శుక్రవారం నుంచి ప్రారంభిస్తామని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. మొదటి విడుత ర్యాండమైజేషన్‌లో భాగంగా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల నాయకులతో గురువారం ఆయన ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత కలెక్టరేట్ భవనంలోని ఎన్నికల పరికరాలపై వీవీ ప్యాడ్స్, ఈవీఎంల ర్యాండమైజేషన్ నిర్వహిస్తామన్నారు. అనంతరం నాలుగు నియోజక వర్గాల్లోని స్ట్రాంగ్ రూంలకు తరలిస్తామని చెప్పారు. ఈ ర్యాండమైజేషన్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనాలని కోరారు. అభ్యర్థులు ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఉపయోగించే ప్రచార సామగ్రిని నిర్ణయించిన రేట్ల ప్రకారం లెక్కించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఎస్పీ నాగభూషణం, ఆర్‌అండ్‌బీ ఈఈ యాకుబ్, డీయం సివిల్ సప్లై అధికారి రాంపతినాయక్, రాజకీయ పార్టీల ప్రతినిధులు సవరాల సత్యనారాయణ, చకిలం రాజేశ్వర్‌రావు, కోట గోపి, రమేశ్, స్టాలిన్ పాల్గొన్నారు.

సీ-విజిల్ యాప్ ప్లెక్సీ ఆవిష్కరణ

సూర్యాపేట : కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సీ- విజిల్ యాప్ ప్లెక్సీని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ ఎస్పీ రాహుల్ హెగ్డే తో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ ఈ యాప్ ప్లయింగ్ స్క్వాడ్స్‌తో అనుసంధానం చేశారన్నారు. అక్రమాలకు సంబంధించిన ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తే 100నిమిషాల్లో దర్యాప్తు చేసి ఫిర్యాదుదారుడికి తెలుపుతామని తెలిపారు. ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చుట్టుపక్కల జరుగుతున్న ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు అడ్డుకునేందుకు ఈ యాప్ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు.

వ్యయ పరిశీలకులదే కీలకపాత్ర

సూర్యాపేట : ఎన్నికల నిర్వహణలో వ్యయ పరిశీలకులదే కీలక పాత్ర అని కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు. కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ హాల్‌లో వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ బృందాలు, ఆడిట్ బృందాల శిక్షణ కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు.

ఎన్నికల వేళ గ్రామాల్లో అప్రమత్తం

● ఎస్పీ రాహుల్ హెగ్డే

సీఎం సభా ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

హుజూర్‌నగర్, అక్టోబర్ 19 : ఎన్నికలు సమీస్తున్న వేళ గ్రామాల్లో నిఘాను అప్రమత్తం చేసినట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. ఎన్నికల నిర్వహణ బందోబస్తు ఏర్పాట్లలో భాగంగా గురువారం ఆయన హుజూర్‌నగర్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి సర్కిల్ పరిధిలోని హుజూర్‌నగర్, మఠంపల్లి, గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకవీడు మండలాల్లో గల సమస్యాత్మక గ్రామాల గురించి, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల గురించి సమీక్షించారు. గ్రామాల్లో కట్టుదిట్టమైన నిఘాను ఏర్పాటు చేయాలని సమస్యలను సృష్టించే వ్యక్తులను ముందస్తుగా బైండోవర్ చేయాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలను సందర్శిస్తూ ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా ఎప్పటి కప్పుడు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఈ నెల 31న నిర్వహించనున్న సీఎం కేసీఆర్ సభాస్థలాన్ని పరిశీలించి రక్షణ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్, కోదాడ సర్కిల్ సీఐలు రామలింగారెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పారా మిలిటరీ సిబ్బందికి వసతి పరిశీలన

సూర్యాపేట సిటీ : ఎన్నికల నేపథ్యంలో బందోబస్తు నిర్వహణకు జిల్లాకు రానున్న పారా మిలటరీ సిబ్బంది కోసం జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వసతి ఏర్పాట్లను ఎస్పీ రాహుల్ హెగ్డే గురువారం పరిశీలించారు. జిల్లాకు రానున్న సిబ్బంది కోసం ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు.

21నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు

సూర్యాపేట సిటీ : జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ నెల 21న పోలీస్ అమరవీరుల సంస్మణ దినోత్సవం ఫ్లాగ్ డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ రాహుల్ హెగ్డె తెలిపారు. ఈ నెల 21 నుంచి జాతీయ ఐక్యత దినోత్సవం అక్టోబర్ 31వ రకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అర్చకులు

24న దసరా జరుపుకోవాలి

● సూర్యాపేట ప్రధాన దేవాలయాల అర్చకులు

బొడ్రాయిబజార్, అక్టోబర్ 19 : విజయదశమి పండుగ నిర్వహణలో ప్రజలకు ఎలాంటి అనుమానాలు వద్దని దశమి తిథి ప్రధానంగా ఉన్న ఈ నెల 24న మంగళవారం పండుగను నిర్వహించుకోవాలని సూర్యాపేట ప్రధాన దేవాలయాల అర్చకులు సూచించారు. జిల్లాకేంద్రంలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మన ఇంట్లో ఏదైనా శుభ కార్యం చేసేటప్పుడు అష్టమి కష్టాలు పెడుతుందని నవమి నష్టాలు తెస్తుందని ఆ తిథుల్లో ఎలాంటి కార్యక్రమాలు చేయమని, అలాంటి 23న నవమి తిథిలో విజయదశమి ఎలా నిర్వహిస్తారన్నారు. విజయదశమి అంటేనే దశమి తిథిలో చేయాలని సూర్యోదయంలో దశమి తిథి ఉందని అందుకే దశమి తిథి ఎక్కువగా ఉన్న 24నే దసరా పండుగ నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు. సమావేశంలో వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, వేణుగోపాల స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు మురళీధరాచార్యులు, భక్తాంజనేయ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు రామానుజాచార్యులు, శ్రీధరాచార్యులు, వేదాంత భజన మందిర ప్రధాన అర్చకులు ధరూరి సింగారాచార్యులు, రాఘవాచార్యులు, సంకర్షణ ఆచార్యులు, రామానుజ, శ్రీహరి, ఫణికుమార్, మరిగంటి శరత్‌చంద్ర, శ్రీనాథ్ ఆచార్యులు పాల్గొన్నారు.

31 హుజూర్‌నగర్‌కు సీఎం కేసీఆర్

● ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్, అక్టోబర్ 19 : పట్టణంలో ఈ నెల 31న నిర్వహించనున్న సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి కోరారు. పట్టణ పరిధిలోని గ్రీన్‌వుడ్ పాఠశాల సమీపంలో ఏర్పాటు చేస్తున్న సభాస్థలిని పోలీస్, విద్యుత్ అధికారులు, ఎన్నికల ఇన్‌చార్జి తిప్పన విజయసింహారెడ్డితో కలిసి గురువారం పరిశీలించారు. సీఎం చాపర్ దిగేందుకు అనువైన ప్రదేశాన్ని ఎమ్మెల్యే ఎంపిక చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయాలకు తెరలేపిందన్నారు. సంతలో గొర్ల మాదిరిగా డబ్బులతో నాయకులను కొనుగొలు చేసుకునే దుస్థితికి చేరిందని విమర్శించారు. ఐదేండ్లలో ప్రజలను, నియోజకవర్గాన్ని కనీసం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను పట్టించుకోని నాయకులు కొత్త కొత్త వేషాలతో ప్రజలను మోసం చేయడానికి వస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటకలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందన్నారు. ఆయన వెంట జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, గుండా బ్రహ్మారెడ్డి, అమర్ , కడియం వెంకట్‌రెడ్డి, గురవయ్య, కెఎల్ఎన్‌రెడ్డి, రాజారావు, విద్యుత్ డీఈ వెంకటకృష్ణ, సీఐ రామలింగారెడ్డి పాల్గొన్నారు.

ఆర్వీ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

నాణ్యమైన వైద్యంతో ప్రజల మన్ననలు పొందాలి

● ఆర్వీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించిన మంత్రి జగదీశ్‌రెడ్డి

బొడ్రాయిబజార్, అక్టోబర్ 19 : నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యాన్ని అందించి అందరి మన్ననలు పొందాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సూచించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆర్వీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, ఆర్వి ఫెర్టిలిటీ సెంటర్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాకేంద్రంలో మెడికల్ కళాశాల ఏర్పాటుతో పేద ప్రజలకు వైద్యం మరింత చేరువైందన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు వ్యాపారమే లక్ష్యంగా గాకుండా ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించాలన్నారు. గతంలో చిన్న వైద్యానికి హైదరాబాద్‌కు వెళ్లే వారని ప్రస్తుతం జిల్లా కేంద్రంలోనే తక్కువ ఖర్చుతో కార్పొరేట్ వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు గండూరి ప్రకాశ్, బెల్లంకొండ రామ్మూర్తిగౌడ్, డాక్టర్లు అలక ప్రేమ్‌కుమార్‌గౌడ్, బెల్లంకొండ ప్రియాంక, బెల్లంకొండ భరత్‌గౌడ్ పాల్గొన్నారు.

అన్నదానం ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత, చైర్‌పర్సన్ అన్నపూర్ణ

కనకదుర్గ ఆలయంలో మహా చండీ హోమం

● ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత

బొడ్రాయిబజార్, అక్టోబర్ 19 : జిల్లాకేంద్రంలోని కనకదుర్గ ఆలయంలో మహాచండీ హోమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సతీమణి సునీత అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపీ లింగయ్యయాదవ్ సతీమణి నాగమణి, కౌన్సిలర్ రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ అనంతుల కృపాకర్, బీఆర్ఎస్ నాయకులు కక్కిరేణి సత్యనారాయణ, తప్పెట్ల చిన్న శ్రీరాములు, సారగండ్ల మాణిక్యమ్మ, కరుణశ్రీ, నాగేశ్వర్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాసవీ మాత ఆలయంలో ఛండీహోమం

జిల్లాకేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. 5వ రోజు గురువారం అమ్మవారు లలితా త్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. టీటీడీ వేద పండితులు నవీన్‌శర్మ చేతుల మీదుగా మహా చండీ హోమాన్ని నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలు మీలా మహదేవ్, వాసుదేవ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు శింగిరికొండ సురేందర్, ఉపాధ్యక్షుడు శింగిరికొండ రవీందర్, ప్రధాన కార్యదర్శి ఈగ వెంకటేశ్వర్లు, కోశాధికారి పోలా రాధాకృష్ణ, గుండా శ్రీధర్, కుక్కడపు జానకిరామయ్య, చిలుకల శ్రీనివాస్, స్వాతి, ఆలయ అర్చకులు అనవజ్జుల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా మహబూబాబాద్ జిల్లా, మహబూబాబాద్ మండలం, మహబూబాబాద్ గ్రామ కాపురస్తులగ శ్రీ/శ్రీమతి మద్దినేని మంజుల, భర్త: హరికృష్ణ, నివాసం: గ్రామము: మహబూబాబాద్, మండలం మహబూబాబాద్, జిల్లా: మహబూబాబాద్ వీరు శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ మహబూబాబాద్ బ్రాంచీ వారిని ఋణ సదుపాయం పొందుటకు హామీగా ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని తమ రిజిష్టర్ దాన సెటిల్‌మెంట్ దస్తావేజు నెం. 9825/2023, తేది: 12-07-2023, సూర్యపేట సబ్ రిజిస్ట్రార్ వారి సమక్షములో రిజిష్టర్ కాబడిన దాని ద్వారా సంక్రమించిన ఆస్తిని హామీగా ప్రతిపాదించగా సదరు శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ వారు తమ సమ్మతిని తెలిపియున్నారు. సదరు షెడ్యూల్ ఆస్తి విషయమై గాని సదరు ఋణ సదుపాయ విషయమైగాని ఎవరికేని ఎలాంటి అభ్యంతరములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన (7) దినములలో తగు ఆధారములతో ఈ దిగువ తెలిపిన అడ్రస్ యందు సంప్రదించగలరు. లేని యెడల ఎలాంటి అభ్యంతరములు లేవని తలచి సదరు ఋణ సదుపాయ విషయమై పై కంపెనీ వారు తదుపరి చర్యలు గైకొందురు. గడువు తర్వాత వచ్చిన అభ్యంతరములు పరిగణలోకి తీసుకోబడవు.

షెడ్యూలు ఆస్తి: సూర్యపేట జిల్లా, చివ్వెంల మండలం, సూర్యపేట మున్సిపల్ (పాత గ్రామ పంచాయితిలోని కుడకుడ) పరిధిలోని కుడకుడ రెవెన్యూ గ్రామం నందు సర్వే నెం. 358 లో గల ఇంటి నెం. 4-152 దాని విస్తీర్ణం: 163.33 చ.గ.లు సమము: 136.56 చ.ఫీ.లు దానికి హద్దులు: తూర్పు: 15 అడుగుల రోడ్డు, పడమర: వెంకన్న గారి స్థలము, ఉత్తరం: ధనమ్మ గారి స్థలం, దక్షిణం: రామాచారి గారి స్థలము.

తేది: 19-10-2023,

ఇట్లు: **బి. ఆనంద్ కుమార్,** అడ్వకేట్,
మహబూబాబాద్, 506 101, Cell: 9440241819.